దర్జాగా కబ్జా

అధికారులు, కూటమి నేతల అండదండలతో వ్యవహారం



ఆక్రమిత స్థలంలో విద్యుత్ మీటర్



ఆరిలోవ: జీవీఎంసీ 13వ వార్డులో ఆక్రమణలు జోరందుకొన్నాయి. ఎక్కడ ప్రభుత్వ భూములు కనిపించినా ఆక్రమణదారులు వాలిపోతున్నారు. వాటికి నకిలీ పత్రాలు సృష్టించి వేరే ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేయించేస్తున్నారు. సంబంధిత అధికారులను ప్రసన్నం చేసుకొని సొమ్ము చేసుకొంటున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ప్రాంతంలో ఆక్రమణలు పెరిగిపోయాయి. దారపాలెంలో సింహాచలం దేవస్థానం కొండను ఆనుకొని ఎకరాలు కొద్దీ రెవెన్యూ భూములు ఆక్రమణకు గురయ్యాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో వాటికి అడ్డుకట్టపడింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మళ్లీ ఈ ప్రాంతంలో ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు.

- దారపాలెంలో ఖాళీ స్థలాల ఆక్రమణ
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- నకలీపత్రాలు సృష్టించి వేరే ప్రాంతంలో రిజిస్ట్రేషన్లు

● సర్వే నంబర్ 15/2లో రెవెన్యూకు చెందిన కొండ పోరంబోకు భూమి ఉంది. ఈ భూమిలో ఇప్పటికే కొంత స్థలం ఆక్రమణకు గురైంది. పలుచోట్ల నివాసాలు నిర్మించేశారు. దేవస్థానం కొండను ఆనుకొని హెవీ ఇద్యుత్ లైన్ దిగువున పలు స్థలాలు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారు. ఇందులో భాగంగా ఇక్కడ కొందరు వ్యక్తులు ఇటీవల సుమారు 700 చదరపు గజాల స్థలం ఆక్రమించారు. ఇందులో ఐదు ప్లాట్లుగా చేసి కొందరికి విక్రయించారు. ఆయా స్థలాల్లో నాలుగు రోజుల క్రితం నిర్మాణ పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా రాత్రి సమయంలో ఆ స్థలాల్లో నాలుగు బోర్లు తీయించారు. దానికి విద్యుత్ విభాగం అధికారులు విద్యుత్ మీటర్ కూడా వేశారు. ఆ మీటర్‌ను ఖాళీ స్థలంలో కర్రలకు అమర్చేసి అందుబాటులో ఉన్న విద్యుత్ స్తంభానికి తీగలు అమర్చారు. ఈ విషయం తెలుసుకొన్న చినగదిలి రూరల్ మండలం అధికారులు రెండు రోజుల క్రితం ఆ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబర్ 15/2లో ఉన్న ఈ స్థలం కొండ పోరంబోకులో ఉన్నట్లు గుర్తించి వెంటనే పనులను నిలిపేశారు. దీంతో ఆక్రమణదారులు కొందరు అక్కడకు చేరుకొని తమ వద్ద ఆ స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్లు ఉన్నాయంటూ హడావుడి చేశారు. ఆ డాక్యుమెంట్లు తీసుకువచ్చి చూపమని అడిగితే వారంతా పలాయనం చిత్తగించారు. ఇదిలా ఉండగా అక్కడ పనులు జరుపుతున్న జేసీబీని మాత్రం రెవెన్యూ అధికారులు సీజ్ చేయకుండా వదిలేయడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో పాటు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అనుచరులు సహకారంతో ఇక్కడ ఆక్రమణలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ స్థలంలో గత ఏడాది డిసెంబర్‌లో రూరల్ మండలం రెవెన్యూ అధికారులు సర్వే జరిపి కొండ పోరంబోకు స్థలంగా నిర్ధారించారు. అయినా అదే స్థలం ఇప్పుడు ఆక్రమణకు గురికావడం విశేషం. ఇక్కడ ధరలను బట్టి ఆ స్థలం సుమారు రూ.3 కోట్లకు పైగా ఉంటుందని స్థానికుల అంచనా వేస్తున్నారు.

● ఇదే ప్రాంతంలో బీఆర్‌టీఎస్‌ను ఆనుకొని స్థలాన్ని ఓ ఆటో మొబైల్ సంస్థ ఆక్రమించి నిర్మాణం చేపడుతోంది. బీఆర్టీఎస్ నిర్మాణం చేపట్టినప్పుడు ఇక్కడ ఫుట్‌పాత్‌లకు ఇరువైపులా సుమారు 20 అడుగుల స్థలాన్ని ఖాళీగా విడిచిపెట్టారు. భవిష్యత్‌లో రోడ్డు విస్తరణ కోసం దీన్ని సిద్ధంగా ఉంచారు. ఈ స్థలంలో తాత్కాలికంగా గ్రీనరీ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ జీవీఎంసీ అధికారులు ఖాళీగా వదిలేయడంతో ఆ స్థలాన్ని ఆక్రమించారు.

● ఇదే ప్రాంతం సర్వే నంబర్ 14/2, 14/1 సర్వే నంబరులో మరో ఆక్రమణకు ఓ వ్యక్తి సిద్ధమయ్యాడు. ఇక్కడ **రహదారినే సదరు** వ్యక్తి ఆక్రమించేశాడు. ఇక్కడ లేఅవుట్‌లో **కొన్ని ప్లాట్లు** అదనంగా చేర్చేశాడు. ఇక్కడ గతంలో ఓ **ప్రైవేట్ వ్యక్తి** 42 ప్లాట్లతో ఈ లేఅవుట్ వేశారు. నిబంధన**లు** ప్రకారం ప్లాట్లు మధ్య రహదారుల కోసం స్థలాలు కేటాయించారు. ఇటీవల సింహాచలం ప్రాంతానికి చెందిన ఓ రాజకీయ నాయకుడు దీని మధ్యలో ఉన్న 30 అడుగుల రోడ్డును పూర్తిగా ఆక్రమించి ప్లాట్లుగా మార్చేశాడు. దీంతో మరో 8 ప్లాట్లు అదనంగా చేరాయి. ఆ ప్లాట్లకు దర్జాగా ప్రహరి నిర్మించాడు. అయితే రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు **తీసుకోక** పోవడం విశేషం.



దారపాలెం సర్వేనంబర్ 15/2లో ఆక్రమణ స్థలంలో బోర్లు



దారపాలెం వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డు స్థలంలో ఓ ఆటో మొబైల్ సంస్థ నిర్మించిన షెడ్డు



ఆక్రమణలపై చర్యలు తీసుకుంటాం

దారపాలెంలో 15/2లో రెవెన్యూకు చెందిన కొండపోరంబోకు స్థలం ఉంది. ఆ స్థలంలో కొందరు ప్లాట్లుగా చేసి నిర్మాణాలు చేపడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయి. దీంతో ఆ స్థలాన్ని పరిశీలించాం. అక్కడ జరుగుతున్న నిర్మాణ పనులను నిలిపివేశాం. మళ్లీ అక్కడ ఎలాంటి నిర్మాణం చేపట్టకూడదని హెచ్చరించాం. అక్కడ పనులు జరుపుతున్న జేసీబీని తిరిగి పంపించేశాం. ఆ స్థలం మాదేనంటూ కొందరు వచ్చారు. దానికి సంబంధించిన డాక్యుమెంట్లు తీసుకురమ్మని అడిగితే ఇంతవరకు తీసుకురాలేదు. ఆ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం.

–హరితేజ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, రూరల్ మండలం

క్లుప్తంగా

ఏయూను సందర్శించిన బౌద్ధ భిక్షువు ఆనందతీర



వీసీ రాజశేఖర్‌ను కలసిన బౌద్ధ భిక్షువు ఆనంద

విశాఖ విద్య: బెంగళూరులోని మహాబోధి సొసైటీ జనరల్ సెక్రటరీ బౌద్ధ భిక్షువు ఆనంద తీర మంగళవారం ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఏర్పాటవుతున్న బౌద్ధ ధ్యాన కేంద్రం ప్రగతిని వీసీ ఆచార్య రాజశేఖర్‌కు వివరించారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన ఆచార్య రాజశేఖర్‌కు ఆశీసులు అందజేశారు. నేటితరం యువత తీవ్రమైన ఒత్తిడి, మానసిక సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వీటికి పరిష్కారాల చూపే దిశగా ఈ ధ్యాన కేంద్రం పనిచేయాలని వీసీ ఈ సందర్భంగా వారిని కోరారు.

ఉండవల్లి సుజాతకు పురస్కారం



ఉండవల్లి సుజాత

ఏయూక్యాంపస్: నగరానికి చెందిన రచయిత్రి, గాయని, వాఖ్యాత ఉండవిల్లి సుజాత మూర్తికి హైదరాబాద్‌కు చెందిన సెలబ్రేషన్ మేకర్స్ సంస్థ 2025 మహిళా దినోత్సవం పురస్కరించుకుని గ్రాండ్ క్వీన్ పురస్కారాన్ని ప్రకటించింది. ఈ నెల 5వ తేదీన హైదరాబాద్‌లో జరిగే కార్యక్రమంలో కజకిస్తాన్ రాయభారి డాక్టర్ నవాబ్ మిర్ నాసిర్ అలీఖాన్ చేతులమీదుగా దీనిని స్వీకరిస్తారు.

ఇస్కాన్‌లో రేపు ఆధ్యాత్మిక ప్రవచనం

ఏయూక్యాంపస్: ఇస్కాన్ విశాఖపట్రం కేంద్రం ఆధ్వర్యంలో గురువారం కలకాంత్ ప్రభుచే ఆధ్యాత్మిక ప్రసంగం నిర్వహిస్తున్నట్లు ఇస్కాన్ అధ్యక్షుడు సాంబ దాస్ తెలిపారు. అమెరికాకు చెందిన కలకాంత్ ప్రభుచే గురువారం సాయంత్రం 6 గంటలకు కాలాతీత వేద జ్ఞానంపై ప్రసంగిస్తారు. అదే విధంగా వ్యక్తి ప్రేరణకు ఈ ఆధ్యాత్మిక ప్రసంగం ఉపకరిస్తుంది. కార్యక్రమంలో హరినామం విశిష్టతను, శ్రీ కృష్ణుని లీలలను వివరిస్తారు.

సాధనతో అంతఃకరణ శుద్ధి



ప్రవచనాలు చెబుతున్న పరిపూర్ణానందస్వామి

మద్దిలపాలెం: మనసుతో సాధన చేస్తే అంతఃకరణ శుద్ధి సాకారమవుతుందని, మనసు బుద్ధి, చిత్తంతో సాధనకు అనుకూలంగా మార్చుకుంటే మానసిక వికాసం పొందగలమని పరిపూర్ణనంద స్వామిజీ ప్రవచించారు. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో నాలుగోవ రోజు మంగళవారం సాధన రహస్యం అనే అంశంపై ప్రసంగించారు. అహంకారం అనేది వీడితే విజయం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో విశాఖ మ్యూజిక్, డ్యాన్స్ అకాడమీ అధ్యక్షుడు మంతెన సత్యనారాయణ రాజు, ప్రధాన కార్యదర్శి డాక్టర్.గుమ్ములూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన



ర్యాలీలో పాల్గొన్న జడ్జి వెంకట శేషమ్మ

బీచ్‌రోడ్డు: ఈస్ట్ పాయింట్ పాయింట్ కాలనీలో కేడీపీయం హైస్కూల్‌లో మంగళవారం పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సునకు డీఎల్‌ఎస్‌ఏ జడ్జి ఎం.వెంకట శేషమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోక్సో చట్టంలోని అనేక అంశాలను వివరించారు. లైంగిక వేధింపుల నుంచి ఎలా కాపాడుకోవాలో విద్యార్థినుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు వివరించారు. అనంతరం అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ జి.జయాదేవి, మండల విద్యాశాఖాధికారి రామారావు తదితరులు పాల్గొన్నారు .

సమాన పనికి సమాన వేతనం చెల్లించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు ఆదినారాయణ డిమాండ్

సీతమ్మధార: కాంట్రాక్ట్ శానిటేషన్ వర్కర్లకు కోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జాతీయ ఉపాధ్యక్షుడు డి.ఆదినారాయణ డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ నేతృత్వంలో ప్రభుత్వ ఆస్పత్రి కాంట్రాక్ట్ శానిటేషన్ కార్మికులు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏఐటీయూసీ నాయకత్వంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆదినారాయణ మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశానుశారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని ఉన్నత న్యాయస్థానం తీర్పునిచ్చినా అమలు చేయని కాంట్రాక్టర్లపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కనీస వేతనం రూ.35 వేలు చెల్లించాలని, బేసిక్ వేతనంతోపాటు డీఏ, గ్రాట్యుటీ, ఇతర అలవెన్సులు, కుటుంబానికి మెడికల్ అలవెన్సులు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ దృష్టికి న్యాయమైన డిమాండ్లను తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా పరిష్కరించమని కోరుతామన్నారు. నిరసనలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి జీఎస్‌జే అత్యుతరావు, మన్మథరావు, మెడికల్ కాంట్రాక్టు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యదర్శి జేడీ నాయుడు, రాజబాబు, ప్రభుత్వ హాస్పిటల్ ఉద్యోగుల సంఘం నాయకులు అప్పలరాజు, గణేష్, రాష్ట్ర బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పడాల రమణ, జి.వామన మూర్తి, పడాల గోవింద్, కాసుబాబు, ఎస్.నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

రహదారులు శిథిలం



ఇందిరాగానగర్‌లో సీసీ రోడ్డు మధ్యలో గోతులు

ఆరిలోవ: జీవీఎంసీ పదో వార్డు పరిధి పాత డెయిరీ ఫారం దరి ఇందిరానగర్‌లో రహదారులు శిథిలావస్థకు చేరాయి. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, వెటర్నరీకాలనీలలో రహదారి మధ్యలో ఏర్పడిన గోతులతో వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. రహదారులకు మరమ్మతులు చేయాలని స్థానిక కార్పొరేటర్, సచివాలయ సిబ్బందికి ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదని స్థానికులు తెలిపారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రహదారులను మెరుగుపరచాలని కోరారు.

మహిళా దినోత్సవ జెండా ఆవిష్కరణ



ఆరిలోవ కాలనీలో జెండా ఆవిష్కరిస్తున్న మహిళా సమాఖ్య సభ్యులు

ఆరిలోవ: మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం ఆరిలోవ కాలనీలో మహిళలు జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.ఎ బేగం మాట్లాడుతూ మహిళల సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల హక్కులను గాలికి వదిలేస్తున్నాయని తెలిపారు. పోరాటాలు ద్వారా సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య నేతలు బి.సుష్పలత, కె.వీర కన్యమ్మ, కె.వనజాక్షి, దేవుడమ్మ పాల్గొన్నారు.

ఉద్యోగులకు నైపుణ్య శిక్షణ తరగతులు

ఏయూ వీసీ రాజశేఖర్



మాట్లాడుతున్న వీసీ రాజశేఖర్

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం బోధ నేతర సిబ్బందికి విభిన్న విభాగాలు, అంశాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా ప్రత్యేక శిక్షణ తరగతుల నిర్వహిస్తానని వీసీ ఆచార్య రాజశేఖర్ అన్నారు. మంగళవారం అకడమిక్ సెనేట్ మందిరంలో వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్యూటీ రిజిస్ట్రార్, అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు, సూపరింటెండెంట్లు, ఇతర విభాగ అధిపతులతో ఆయన సమావేశమయ్యారు. పరిపాలన విభాగాలలో పనిచేస్తున్న సిబ్బంది, వారి విధులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ వర్సిటీ ప్రతిష్టను పరిరక్షిస్తూ, మరింత పెంపొందించే దిశగా ప్రతి ఉద్యోగి పని చేయాలని సూచించారు. త్వరలో శతాబ్ది ఉత్సవాలు జరగనున్న నేపథ్యంలో మరింత వేగంతో పనిచేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. త్వరలో విభాగాల వారీగా ఉద్యోగులతో ప్రత్యేక సమావేశం, సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

ఏయూ వీసీకి అభినందనలు

ఆంధ్ర విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆచార్య జీపీ రాజశేఖర్‌ను వర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్లు ఆచార్య బీలా సత్యనారాయణ, ఆచార్య జీఎస్ఎన్ రాజు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతిష్టాత్మకమైన ఆంధ్రవిశ్వవిద్యాలయానికి వీసీగా నియమితులు కావడం ఎంతో అభినందనీయమన్నారు.



వీసీతో భేటీ అయిన పూర్వ వైస్ చాన్సలర్లు

వందేళ్ల ఉత్సవాల్లో భాగస్వామ్యులను చేయండి

ఆంధ్ర యూనివర్సిటీ వందేళ్ల ఉత్సవాల్లో తమను భాగస్వామ్యులను చేయాలని వర్సిటీలో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులు వీసీ రాజశేఖర్‌ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.సురేష్ మీనన్, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ శిరీష్, విక్రమ్, సురేంద్ర, దాస్, త్రినాథ్, పట్నాయక్, దంతేశ్వరి ,సులోచన, జ్యోతి రమ్య తదితరులు పాల్గొన్నారు,

సమస్యలను పరిష్కరించాలి

ఆంధ్ర యూనివర్సిటీలో నెలకొన్న విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్‌ను కలిసి క్యాంపస్ కాలేజీలు, వసతిగృహాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు స్కాలర్‌షిప్ రాకపోవడంతో నెలకు విద్యార్థుల నుంచి రూ. 3,500లకు పైగా ఫీజును వసూలు చేస్తున్నారన్నారు. ఫీజు చెల్లించని సందర్భంలో విద్యార్థుల హాస్టల్ మెస్ కార్డులను నిలిపివేస్తున్నారని వీసీ దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం వీసీకి వినతిపత్రం అందజేశారు.

బుచ్చిరాజు సేవలు ప్రశంసనీయం

మహారాణిపేట: వైద్య రంగానికి డాక్టర్ బుచ్చిరాజు అందించిన సేవలను పలువురు వైద్యులు ప్రశంసించారు. మంగళవారం మహారాణిపేటలోని ప్రకృతి చికిత్సాలయంలో శ్రీ గాయత్రి వెల్ఫేర్ కల్చరల్ యూత్ అకాడమీ, రూపాకుల విశాలాక్షి చారిటబుల్ ట్రస్ట్, భారతీయ జనతా పార్టీ వైద్య విభాగం ఆధ్వర్యంలో ఆంధ్ర మెడికల్ కాలేజ్ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ జి. బుచ్చిరాజు అభినందన సభలో పలువురు వైద్యులు ప్రసంగించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ ఎస్ఏఎస్ మూర్తి, న్యూరో సర్జరీ వైద్య నిపుణులు డాక్టర్ ఎస్ సుబ్రహ్మణ్యం, ఈఎన్‌టీ వైద్య నిపుణులు డాక్టర్ కే.కృష్ణ కిషోర్, ప్రముఖ ఈఎన్‌టి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్. లక్ష్మీనారాయణ, బీజేపీ విశాఖ నగర అధ్యక్షుడు ఎంఎంఎన్ పరశురామరాజు తదితరులు పాల్గొని బుచ్చిరాజు సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ ఏపీ వైద్య విభాగ కన్వీనర్ రూపాకుల రవికుమార్, ప్రొఫెసర్ పుల్లారావు, డాక్టర్ శ్రీ లక్ష్మి, టి.నాగమణి, రెడ్డిపల్లి శ్రీనివాసరావు, చొక్కాకుల రాంబాబు, ఓ ఆల్బర్టు, వేంకటేశ్వరరావు, దేవర చంద్రశేఖర్, రామారావు, గోవింద్ సుశీల, సత్యనారాయణ, మచ్చ సోమేష్, ఈశ్వరరావు, శారద, సన్యాసమ్మ, తోటమ్మ పాల్గొన్నారు.



బుచ్చిరాజును సత్కరిస్తున్న వైద్యులు

వెయిట్ లిఫ్టింగ్‌లో పల్లవికి బంగారు పతకం

అభినందించిన ఏయూ వీసీ

విశాఖ విద్య: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్ సాధించిన వర్సిటీ విద్యార్థిని పల్లవిని వైస్ చాన్సలర్ ఆచార్య రాజశేఖర్ అభినందించారు. వెయిట్ లిఫ్టింగ్ పోటీలు సెంట్రల్ యూనివర్సిటీ ధర్మశాలలో ఇటీవల జరిగాయి. ఈపోటీల్లో ఆంధ్రాయూనివర్సిటీ తరఫున పాల్గొన్న క్రీడాకారులు పతకాలు సాధించారు. 71 కిలోల విభాగంలో ఎస్. పల్లవికి గోల్డ్ మెడల్, 76 కిలోల విభాగంలో బి. జాన్సీ బ్రాంజ్ మెడల్ సాధించారు. అలాగే కేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో 71 కిలోల విభాగంలో ఎస్. పల్లవికి సిల్వర్ మెడల్, సీహెచ్ శ్రీలక్ష్మి 87కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులు మంగళవారం వీసీని కలిశారు. స్పోర్ట్స్ డైరెక్టర్ ఆచార్య విజయ మోహన్ విద్యార్థుల సాధించిన క్రీడా ప్రతిభ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఈఎన్ ధనుంజయరావు, డాక్టర్ ఎల్‌బీ కళాశాల వ్యాయామ విద్యా విభాగం హెడ్ డాక్టర్ వై. శ్రీనివాసరావు క్రీడాకారులు పాల్గొన్నారు.



పల్లవిని అభినందిస్తున్న వీసీ రాజశేఖర్

‘సంక్రాంతికి వస్తున్నాం’ సక్సెస్ మీట్

డాబాగార్డెన్స్: సంక్రాంతికి వస్తున్నాం చిత్రం విజయవంతంగా 50 రోజులు ప్రదర్శించి, రూ.300 కోట్లకు పైగా గ్రాస్‌తో రికార్డు సృష్టించిన సందర్భాన్ని పురస్కరించుకొని మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సక్సెస్ మీట్ నిర్వహించారు. సిటీ వైడ్ వెంకటేష్, రానా ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వేంకటేశ్వర ఫిలిమ్స్ మేనేజర్ విజయ భాస్కర్, సురేష్ ఫిలిమ్స్ మేనేజర్ వేణుబాబు, వెంకటేష్, రానా, మహేష్‌బాబు అభిమానుల సంఘం గౌరవ సలహాదారుడు గంట్ల శ్రీనుబాబు, ఆర్జీ శంకరరావు తదితరులు పాల్గొని కేక్ కట్ చేశారు. అనంతరం సినిమా విజయోత్సవం పురస్కరించుకొని లీలామహల్ థియేటర్ సిబ్బందికి నిత్యావసర వస్తువులు అందజేశారు.

‘ఈత’రం పిల్లలు







పక్షికి ఎగరడం, చేపకు ఈదడం ఎవరు నేర్పారు. జీవితం, జీవనం కోసం వాటంతట అవే నేర్చుకున్నాయి. పుట్టుకతో వీటికి ఈ లక్షణాలు సహజంగా వస్తాయి. అదే రీతిలో మత్స్యకార చిన్నారులకు ప్రత్యేకించి ఎవరూ ఈత నేర్పాల్సిన అవసరం లేదు. ఊహ తెలిసిననాటి నుంచి సంద్రం చెంతనే ఆటలాడుకుంటారు. చిన్నారులు బాల్, బ్యాట్ పట్టుకుని మైదానాలకు వెళితే..వీరు మాత్రం కెరటాలతో ఆటలాడతారు. మంగళవారం చిన్నపాటి ప్లాస్టిక్, స్పాంజ్, థర్మాకోల్ షీట్‌లను ఆధారంగా చేసుకుని కోస్టల్ బ్యాటరీ వద్ద సునాయాసంగా సముద్రపు అలలపై ఆటలాడుతూ సందడి చేశారు. చేప పిల్లల్లా ఉల్లాసంగా ఈత కొట్టారు.

- ఏయూక్యాంపస్ /ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం